పేదలకు భరోసా 'వైఎస్సార్ పింఛన్ కానుక'

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- లబ్ధిదారులకు 793 కొత్త పింఛన్లు పంపిణీ

కాకినాడ: నిరాదరణకు గురైన పేద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వైఎస్సార్ పింఛన్ కానుక ఎంతో భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సూర్యకళామందిరంలో బుధవారం సిటీ నియోజకవర్గ పరిధిలో కొత్తగా మంజూరైన 793 పింఛన్లను ఎమ్మెల్యే ద్వారంపూడి పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ టీడీపీ అధికారాన్ని కోల్పోయే సమయానికి 15,500 ఉండే పింఛన్లు ఇప్పుడు 28,140కి చేరాయన్నారు. అప్పట్లో పింఛన్ పొందాలంటే ఉన్న లబ్ధిదారుల్లో ఒకరు మరణించిన తరువాతే సాధ్యమయ్యేదని, పైగా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే తప్ప వచ్చేవి కాదన్నారు. పేద అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల కష్టాలను పాదయాత్రలో స్వయంగా చూసిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల సొమ్ము పెంపుతోపాటు పారదర్శకంగా పంపిణీ చేపట్టి సామాజిక భద్రత కల్పించారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రతి అవ్వాతాత, ఇతర పింఛన్‌దారులు ఆదరించి ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్ వైఎస్సార్ పింఛన్ కానుక ప్రగతిని వివరించారు. 793 కొత్త పింఛన్లకు సంబంధించి రూ.21.94 లక్షల చెక్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి, ఇతర అధికారులు విడుదల చేశారు. లబ్ధిదారులు రమణమూర్తి, చంద్రకళ మాట్లాడుతూ తమ అర్హతను గుర్తించి వలంటీర్ల ద్వారా ఇంటికే వచ్చి పింఛన్ల మంజూరు చేశారంటూ సంతోషం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, గోడి సత్యవతి, లంకే హేమలత, కర్రి శైలజ తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ల మెగా చెక్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి


గైగోలుపాడులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

వృద్ధులకు ఆర్థిక భద్రత

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- అర్బన్ డివిజన్లలో పింఛన్ల పంపిణీ

కాకినాడ రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకతో వృద్ధులకు ఆర్థిక భద్రత లభిస్తుందని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ నగరంలోని రూరల్ 8 డివిజన్ల పరిధిలో లబ్ధిదారులకు రెండో విడతగా మంజూరైన 134 కొత్త పింఛన్ల సొమ్ములను బుధవారం ఆయన పంపిణీ చేశారు. 49వ డివిజన్‌లోని గైగోలుపాడు రాజేశ్వరినగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పింఛన్లకు కొత్తగా అర్హత పొందిన వారితో పాటు వివిధ కారణాల వల్ల గతంలో నిలిచిపోయిన వారికి అర్హతలు బట్టి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పింఛన్లతో పాటు సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, మాజీ కార్పొరేటర్లు ఐ.శ్రీను, వడ్డి మణికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల చిన్నా, పాలిక రమణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 49వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు.

నేడు మండల పరిషత్ కార్యాలయంలో

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రెండో విడత కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. ఈ ఏడాది 544 మందికి వివిధ రకాల పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ తెలిపారు.

మాధురిని ఆదర్శంగా తీసుకోవాలి


మాధురిని సత్కరిస్తున్న చైర్మన్ శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాయుడు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్యలో చదువుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన కె.మాధురిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి మాధురిని సత్కరించారు. విద్యార్థులతో ముఖాముఖిలో యూపీఎస్సీ పరీక్ష విధానం, విజయ సాధనకు కావలసిన నైపుణ్యాలను మాధురి వివరించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు విద్యార్థులకు రెగ్యులర్ సిలబస్‌తో పాటు పోటీపరీక్షల కోసం ప్రత్యేక సిలబస్ రూపొందించి శిక్షణ ఇవ్వడం వల్ల వేలాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారన్నారు. అనంతరం మాధురిని ఆమె తల్లి ఉమా మహేశ్వరి సమక్షంలో చైర్మన్ శేషారెడ్డి, ఏడీ డాక్టర్ నాయుడు, ఆదిత్య స్కూల్ డైరెక్టర్ శృతిరెడ్డి, అధ్యాపకులు సత్కరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కరప: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కాకినాడ ఆర్డీఓ, నియోజకవర్గ ఈఆర్‌ఓ ఎన్‌వీవీ సత్యనారాయణ పర్యటించి పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, బీఎల్‌ఓలకు, వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. ప్రతి 1,400 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆదేశాల మేరకు ఉప్పలంక, నడకుదురు, పెనుగుదురు, కరప, వేములవాడ, వేళంగి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీఓ కె.అప్పారావు, రూరల్ తహసీల్దార్ కె.మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

టీటీ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

నాగమల్లితోటజంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక సీనియర్ క్రీడాకారుడు సూర్యతేజ జర్మనీలో జరిగే అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ శిక్షణకు ఎంపికయ్యాడని సంఘ కార్యదర్శి కోటగిరి మోహన్‌బాబు బుధవారం తెలిపారు. తండ్రి ప్రకాష్ ఎల్ఐసీలో చిరు ఉద్యోగి. దీంతో సంఘ గౌరవ అధ్యక్షుడు రావు చిన్నారావు, అధ్యక్షుడు విజయప్రకాష్, కార్యదర్శి మోహన్‌బాబు సంఘం తరఫున రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

గంగపుత్రులకు భరోసా ఇస్తూ..

- సూర్యారావుపేటలో ఎమ్మెల్యే కన్నబాబు పర్యటన
- గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం
- త్వరలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని హామీ

కాకినాడ రూరల్: సంద్రంలో చేపలు వేటాడుతూ జీవించే మత్స్యకారుల గ్రామం సూర్యారావుపేట. మత్స్యకారుల అభ్యున్నతికి భరోసా ఇస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామంలో పర్రకాలువ నుంచి సచివాలయం-1 పరిధిలో ఇంటింటికి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ, రహదారుల సమస్యతో పాటు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ మత్స్యకారులకు అండగా నిలిచారన్నారు. వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచడంతో పాటు బీమా రూ.10 లక్షలకు పెంచారన్నారు. వేట సాగించేందుకు బోట్లు, వలలు, ఇతర సామగ్రిని రాయితీపై అందిస్తున్నారన్నారు. గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, పట్టాలను రెండు, మూడు రోజుల్లో అందిస్తామన్నారు. ప్రభుత్వానికి తమకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ సూరాడ చిన్న, రాజు దంపతులు, మాజీ సర్పంచ్ కోమలి సత్యనారాయణ, గ్రామ నాయకులు అర్జలి సింహాద్రి, దావీదు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం-2 పరిధిలో..

రమణయ్యపేట సచివాలయం- 2 పరిధిలో రాయుడుపాలెంలో వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు లింగం రవి, వర ప్రసాద్, గిరీష్ తదితరులు పంపిణీ చేశారు. కొత్తగా 37 పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

సంగీత శిక్షణకు పూర్వవైభవం

సరస్వతీ గానసభలోని కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ కృతికా శుక్లా


సంగీత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ సరస్వతి గానసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత శిక్షణ కేంద్రం పూర్వ వైభవంతో విలసిల్లాలని కలెక్టర్ కృతికా శుక్లా కాంక్షించారు. కోవిడ్‌తో గత కొద్ది కాలంగా నిలిచిపోయిన సంగీత శిక్షణ కేంద్రాన్ని బుధవారం కాకినాడ టౌన్‌హాల్ ప్రాంగణంలో ఆమె ప్రారంభించారు. కళలు మన సంస్కృతి గొప్పదనాన్ని, జాతి వికాసాన్ని ప్రతిబింబిస్తాయని, వాటి పరిరక్షణ, ప్రోత్సాహానికి గాన సభ చేస్తున్న కృషిని కలెక్టర్ కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి మాట్లాడుతూ సరస్వతి గానసభ ఆధ్వర్యంలోని కాకినాడ సూర్యకళామందిరంలో ఎంఎస్ సుబ్బులక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, పండిట్ భీమ్‌సేన్‌జోషి, పర్వీన్ సుల్తానా, టీఎన్ శేషగోపాలన్ వంటి ఉద్దండులు కచేరీలు చేశారన్నారు. ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటులో పూర్వ ఉపాధ్యక్షురాలు లక్కరాజు శేషకుమారి కృషి ఎనలేనిదన్నారు. ఆమె జ్ఞాపకార్థం సంగీత శిక్షణ కేంద్రానికి కార్యవర్గం ఏకగ్రీవ తీర్మానంతో లక్కరాజు శేషకుమారి సంగీత శిక్షణ కేంద్రంగా నామకరణం చేశామని తెలిపారు. విద్యార్థులు నెలకు రూ.500 చెల్లించి ఒక ఏడాది పాటు క్రమం తప్పకుండా హాజరైతే వారు కట్టిన మొత్తం రూ.6 వేల నుంచి రూ.4,500 సంవత్సరాంతంలో తిరిగి చెల్లిస్తామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు ఆంజనేయమూర్తి వివరించారు. ఈ కేంద్రం తిరిగి ప్రారంభించేందుకు సహకరించిన సంస్థ ఉపాధ్యక్షులు లక్కరాజు సత్యనారాయణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సంస్థ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, జీవితకాల గౌరవ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీరామనరసింగరావు, చావలి సూర్యకుమారి, అన్నంరాజు సీతాపతిరావు, మల్లిడి వీరభద్రారెడ్డి, ఆనంద్, చెరుకువాడ సత్యనారాయణ, కాకినాడ లిటరరీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. పలువురు సంగీత విద్వాంసులను కలెక్టర్ కృతికా శుక్లా సత్కరించారు.

మత్స్యకారులకు అండగా ఉంటా

- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: చేపల వేటపై ఆధారపడ్డ మత్స్యకారులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక 14, 15 డివిజన్ల పరిధిలోని ఏటిమొగ పరిసర ప్రాంతాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఎమ్మెల్సీగా కర్రి పద్మశ్రీ, డిప్యూటీ మేయర్‌గా చోడిపల్లి ప్రసాద్‌ల నియామకంతో పాటు అభివృద్ధి పరంగా ఎన్నో కార్యక్రమాలు చేశామన్నారు. సీఎం జగన్ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేలా ప్రజలంతా ఆదరించాలన్నారు. పార్టీ నాయకులు కాటాడి జానకిరామ్, భీమరాజు, అంకాడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్: గుడారిగుంటలోని వీఎస్ లక్ష్మి కళాశాలలో ఈ నెల 15న జరగనున్న జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం ఆవిష్కరించారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరిశేషు, ప్లేస్‌మెంట్ అధికారి శ్యామ్ కిశోర్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, కరీం బాషా, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి

కాకినాడ రూరల్: మండలం వాకలపూడి పరిధిలో పాముగుంట వద్ద టిప్పర్ ఢీకొని నేమాం గ్రామానికి చెందిన పోతంశెట్టి సూరయ్యదొర (78) బుధవారం మృతి చెందాడు. సమీపంలోని ట్యాంకర్స్ యూనియన్ కార్యాలయంలో గుమస్తాగా పనిచేసే సూరయ్యదొర మోటారు సైకిల్‌పై అచ్చంపేట జంక్షన్‌లో పని చూసుకుని ఇంటి వద్దకు వెళ్తుండగా వెనక నుంచి టిప్పర్ ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు వరహాల నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పరిధిలోని ఈశ్వర్‌నగర్ మార్గంలో ఆక్రమణను గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం తొలగించారు. ఏపీఎస్పీ పక్కనే ఉన్న ఈశ్వర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో స్థలం వివాదం కోర్టులో ఉండడంతో కల్వర్టు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మరోవైపు కోర్టులోని వ్యవహారం గ్రామ పంచాయతీకి అనుకూలంగా రావడంతో కార్యదర్శి వెంకటరమణ తదితరులు దగ్గరుండి ఆక్రమణను తొలగింపజేశారు.

విశ్రాంత అధ్యాపకురాలు తారా కామాక్షి మృతి



బోట్‌క్లబ్: స్థానిక ప్రభుత్వ మహిలా కళాశాల విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు తారా కామాక్షి బుధవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ భార్య తారా కామాక్షి. గోపాలకృష్ణను నగరానికి చెందిన పలువురు పరామర్శించి ఓదార్చారు.

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి


సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

బాలాజీచెరువు: పాఠశాల స్థాయిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం పేర్కొన్నారు. పీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రాజెక్టులు తయారు చేయించేలా ప్రోత్సహించాలన్నారు. జాతీయ బాలల సైన్స్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రవి, సైన్స్ అధికారి వినీల్, వివిధ పాఠశాలలకు చెందిన 142 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

డాక్టరేట్ ప్రదానం


ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి పీహెచ్‌డీ తీసుకున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మోపూరి వేంకటేశ్వరరావుకు ఆంధ్రాయూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. క్రీడా విభాగంలో భాగంగా మెంటల్ విజువలైజేషన్ టెక్నిక్స్‌తో క్రీడాకారుడి సామర్థ్యం పెంచుకోవడం ఏలా, ఈ టెక్నిక్స్‌తో కోచ్‌కు, క్రీడా ఉపాధ్యాయులు మరింత ఉన్నత శ్రేణి క్రీడాకారులకు తయారుచేయడం అనే అంశంపై సిద్ధాంత వ్యాసం సమర్పించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అందజేశారు.

మఠాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలోని మఠాలను గుర్తించి వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయశాఖ డీసీ ఎం.విజయరాజు అన్నారు. బుధవారం స్థానిక డీసీ కార్యాలయంలో ఆయన ఈఓలతో సమావేశమై మఠాలు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 17 మఠాల స్థితిగతులపై సమీక్షించారు. దేవదాయశాఖ ఈవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడ్రన్ పెంటాథ్లాన్ స్విమ్మింగ్‌లో జిల్లాకు పతకాలు


విజేతలతో కోచ్ నాని

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మహారాష్ట్ర పూణేలో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన మోడ్రన్ పెంటాథ్లాన్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని వివేకానంద పార్కు స్విమ్మింగ్ పూల్ కోచ్ నాని బుధవారం తెలిపారు. అండర్-11 కేటగిరలో మేధ యశ్విని రెండు రజత పకాలు బైథల్, ట్రైథల్‌లో సాధించిందన్నారు. ఎస్.కృతిక కాంస్య పకతం అందుకుందన్నారు.

తప్పిపోయిన చిన్నారులు లభ్యం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో వివిధ వార్డుల్లో రోగుల బంధువులకు చెందిన ఇద్దరు బాలురు బుధవారం తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి ఆస్పత్రిలో మరోచోట లభ్యమయ్యారు. సూర్యనారాయణపురానికి చెందిన నాలుగు, ఆరేళ్ల చిన్నారులు తల్లిదండ్రుల నుంచి విడివడి బయటకు వచ్చేశారు. ఓ బాలుడు డైస్ కేంద్రం వద్ద, మరో బాలుడు ఎస్ఆర్ఎంటీ బ్లాక్ వద్ద ఏడుస్తూ కనిపించడంతో సెక్యూరిటీ సిబ్బంది వారిని తీసుకువెళ్లి ఆర్ఎంవోకు అప్పగించారు.